# పాఠశాల సంసిద్ధత కార్యక్రమం

విద్యా సం॥లో పాఠశాలలు ప్రారంభమైన రోజు నుండి 45 రోజుల పాటు 1వ తరగతిలో కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఈ కార్యక్రమం ఉద్దేశించబడింది. (జూన్ 15 నుండి జూలై 31 వరకు).

## కార్యక్రమ లక్ష్యాలు

- పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసి 1వ తరగతిలో అడుగిడిన పిల్లలను పాఠశాలకు మానసికంగా సంసిద్ధులను చేయడం.
- పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలకు హాజరు కాకుండా నేరుగా నూతనంగా పాఠశాలలో 1వ తరగతిలో చేరిన పిల్లలందరినీ ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాలకు మానసికంగా సంసిద్ధులను చేయడం.

## శిక్షణా కార్యక్రమం

- ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు మండల రిసోర్స్ పర్సన్స్, మండల విద్యాధికారులు మరియు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమం యొక్క మౌళిక అంశాలపై ఒకరోజు శిక్షణ జూన్ 14వ తేదీన నిర్వహించబడుతుంది.

## కార్యక్రమం అమలు

- పాఠశాల ప్రారంభం నాటికి పాఠశాలను ముఖ్యంగా ఒకటవ తరగతి గది గోడలపై వివిధ రకాల పక్షులు, జంతువులు, పూలు, తదితర చిత్రాలు, బొమ్మలను ప్రదర్శించి ఆకర్షణీయంగా, ఆసక్తికరంగా తీర్చిదిద్దాలి.
- వివిధ రకాల నమూనాలు, చార్టులు, ఆట వస్తువులు, బొమ్మలు, చిత్రకథల పుస్తకాలను తరగతి గదిలో పిల్లలకు అందుబాటులో ఉంచాలి.

- తరగతి గదిలోపల మరియు బయట పిల్లలు ఆడుకునేందుకు అవకాశం కల్పించడం ద్వారా పాఠశాలకు ప్రతి రోజు ఉత్సాహంగా హాజరగునట్లు చూడాలి.
- కథలు, పాటలు, ఆటలను బోధనలో భాగంగా నిర్వహించడం ద్వారా పిల్లలందరూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఆసక్తికరంగా తరగతి గది బోధనాభ్యసన కార్యక్రమాలలో నిమగ్నమయ్యేలా చూడాలి.
- వానచినుకులు కథల పుస్తకాలను తరగతి గదిలో నిత్యం వినియోగించాలి. వాటి లోని చిత్రాలు, సన్నివేశాల ఆధారంగా మాట్లాడించాలి. పదాల గ్రాఫిక్ రీడింగ్ చేయించాలి.
- పాఠశాల సంసిద్ధతకు సంబంధించి వివిధ రకాల సామగ్రిని అంగన్‌వాడీల సహకారంతో రూపొందించుకోవాలి లేదా సమకూర్చుకోవాలి. 1, 2 తరగతులకు NCERT ప్రత్యేకంగా రూపొందించిన గణిత కిట్‌ను (సరఫరా చేసిన హైద్రాబాద్, నల్గొండ జిల్లాల్లో పాఠశాలల్లోని వినియోగించాలి.
- చిత్రాలు, బొమ్మల ద్వారా పిల్లలకు సంఖ్యలు చదవడం, లెక్కించడం, గణిత పూర్వభావనలపై అవగాహన కల్గించేలా దృష్టి సారించాలి.
- బొమ్మలు, చిత్రాలు, వివిధ ఆకారాలు గీయడం, చిత్తురాత, రంగులు వేయడం, బంకమట్టి లేదా మైనంతో బొమ్మలు చేయించడం ద్వారా పిల్లల మానసిక - చలనాత్మక రంగాల అభివృద్ధి జరగేలా చూడాలి.
- 1వ తరగతి బోధించే ఉపాధ్యాయులు పాఠశాల ప్రారంభం నాటికే 45 రోజులకు సంబంధించి పాఠశాలలో, తరగతి గదిలో నిర్వహించవలసి కృత్యాలు, సామగ్రితో రోజు వారీ కాల నిర్ణయ పట్టిక ఆధారంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి.

# పాఠశాల సంసిద్ధతా కార్యక్రమం

## 1. ఎందుకు

పాఠశాల సంసిద్ధతా కార్యక్రమం వలన ఈ కింది అంశాలు పిల్లలో అలవడుతాయి పెంపొందుతారు.

❖ పిల్లలు భయంగా లేకుండా బడికి రావడం క్రమం తప్పకుండా పాఠశాలకు రావడం.

❖ సమయానికి బడికి రావాలి. నిర్దేశించిన సమయం బడిలోనే గడపడం.

❖ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం.

❖ పాటలను రాగయుక్తంగా, అభినయిస్తూ పాడాలి.

❖ కథలను విని ఆనందించాలి. తిరిగి తమ స్వంత మాటల్లో కథలు చెప్పడం.

❖ సూచనలను అనుసరిస్తూ, అందరితో కలిసి ఆడుకోవడం.

❖ టీచరుతో / తోటి పిల్లలతో భయం లేకుండా మాట్లాడడం.

❖ పూర్వ పఠనా / లేఖనా / గణిత నైపుణ్యాలు పొందడం.

❖ బడి కార్యక్రమాలకు సంసిద్ధంగా ఉండడం.

❖ ఇది ‘‘నాబడి’’ అన్న భావన కలిగి ఉండడం.

❖ ఎవరిపై ఆధారపడకుండా తమ పనులు తామే చేసుకోవడం.

❖ బడి అంటే ఆసక్తి కలగడం.

❖ టీచర్‌ని పిల్లలు ఇష్టపడడం.

❖ బడి వాతావరణంలో అహ్లాదకరంగా, ఆనందంగా గడపడం.

❖ పిల్లలకు ప్రేమ / ఆప్యాయత, భద్రతా భావం / వ్యక్తిగత శ్రద్ధ మొదలగునవి. బడిలో లభించాలి.

- ❖ సమాజనుకూలమైన అలవాట్లు, అంటే పంచుకోవటం, సహకరించడం, ఇచ్ఛాపూర్వకంగా ఉత్సాహంగా బృంద కార్యక్రమాలలో పాల్గొనట తన వంతు వచ్చే వరకు వేచి ఉండడం పరస్పర హక్కుల పట్ల, వస్తువుల పట్ల గౌరవం కలిగి యుండటం.

## టీచర్ పిల్లలతో ఎలా ఉండాలి?

- ❖ బడి వాతవరణం, గృహవాతావరణాన్ని మైమరిపించేటట్లు ఆనందంగా ఉండేట్లు చూడాలి.
- ❖ ప్రేమతో ఆప్యాయంగా ఉండాలి.
- ❖ పిల్లల్లో ఒకరిగా కలిసిపోవాలి.
- ❖ పిల్లలను పేర్లు పెట్టి పిలుస్తూ మాట్లాడాలి.
- ❖ శరీర శుభ్రత గురించి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి. (ఉదా॥ కాళ్ళు, చేతులు కడుక్కోవడం, తల దువ్వుకోవడం మొదలగునవి.)
- ❖ పళ్ళు తోముకోవడం, తల దువ్వుకోవడం, గోళ్ళు కత్తిరించుకోవడం, శుభ్రమైన బట్టలు వేసుకోవడం వంటి విషయాల గురించి ప్రతి రోజు శ్రద్ధ తీసుకోవాలి. పిల్లలకు ఇవి అలవాట్లుగా చేయాలి.
- ❖ పిల్లలు చేసే పనులను ఆసక్తులను గుర్తించి ప్రోత్సహించాలి.
- ❖ టీచర్ అనుకున్న విధంగానే పిల్లలు చేయ్యాలని భావించకూడదు. మొదట్లో వారు ఏ పని చేసినా ప్రోత్సహించాలి. (నిర్మాణాత్మకమైన పనులు)
- ❖ బడికి వచ్చే ప్రతి అమ్మాయిని / అబ్బాయిని ఎదో ఒక సందర్భంలో పలకరించాలి.
- ❖ అవకాశమున్నప్పుడల్లా పిల్లల గురించి వారి కిష్టమైన వాటి గురించి, వారి కుటుంబ సభ్యుల గురించి, వారి స్నేహితుల గురించి సంభాషణ జరపాలి.
- ❖ పిల్లలు చెప్పదలచుకున్నది చెప్పడానికి అవకాశం, ప్రోత్సాహం ఇవ్వాలి. ప్రారంభంలో తప్పు, ఒప్పుల కంటే వారి ప్రయత్నానికి ప్రాముఖ్యత ఇవ్వాలి అభినందించాలి.

- శుభ్రంగా లేని పిల్లల కనీస అవసరాలు బడిలోనే తీర్చి, మరుసటి రోజు నుంచి అదే విధంగా రావాలని పిల్లలకు, వారి తల్లిదండ్రులకు సూచనలివ్వాలి.
- పిల్లలను ఎవరితోను పోల్చికించపరచవద్దు.
- ఆట / పాటల ద్వారా పిల్లల్లో మంచి అలవాట్లను విలువలు  పెంపొందించాలి.
- పిల్లలకు పరిచయం ఉన్న ఆట, పాట, కథలను మొదట చెప్పాలి.
- నేర్చుకోవడంలో పిల్లలు ఆనందం పొందేలా చేసి చదువు పట్ల ప్రేరణ కలిగించాలి.

## పాఠశాల సంసిద్ధతలోని అంశాలు

### 1. ఆటలు

- స్థానికంగా ఉండే / పిల్లలు ఆడుకొనే ఆటలనే ఆడించాలి.
- టీచరు నాయకత్వం వహించి తనూ ఆడుతూ, పిల్లల్ని ఆడేందుకు ప్రోత్సహించాలి.
- పిల్లలు ఆటలను ఆనందిస్తే చాలు.
- పిల్లలు భయం లేకుండా స్వేచ్ఛగా ఆడేందుకు ప్రోత్సహించాలి.
- పిల్లలకు తెలిసిన ఆటలను ఆడిస్తూ, కొత్త ఆటలను కూడా పరిచయం చేయాలి.
- నిర్దేశించిన సమయానికి వచ్చిన పిల్లలతో ఆటలు ప్రారంభం చేయాలి.
- ఆట ఆడటానికి ప్రాముఖ్యత ఇవ్వాలి. కాని ఓడిపోవడం, గెలవడం అనేది ప్రధానం ఉండకూడదు.
- ఆటలకు కావలసిన సామగ్రిని పిల్లలకు అందుబాటులో ఉంచాలి.
- ఎవరైనా పిల్లలు ఆడుకోవడానికి ముందుకు రాకపోతే బలవంతపెట్టొద్దు. ఆటను చూస్తూ ఉండమని చెప్పాలి. తరువాత వాళ్లంతట వాళ్లే ఆటల్లో పాల్గొంటారు.

- ❖ స్వేచ్ఛగా ఆడుకోవడానికి వీలు కల్పించాలి. నిబంధనలు మార్చుకునే అవకాశం కల్పించాలి.
- ❖ బడి ఆవరణలో పిల్లల భద్రతకు భంగం కలిగించే వస్తువులను ఉంచరాదు.
- ❖ బడి ఆవరణలో ముళ్లపొదలు / రాళ్ళు మొదలగు వాటిని తీసివేయాలి.
- ❖ బడి ఆవరణ దాటి పిల్లలు బయటికి వెళ్ళకుండా చక్కగా దడి కట్టాలి.
- ❖ గదిలో పిల్లలు స్వేచ్ఛగా ఆడుకునేందుకు వీలుగా వస్తువులు / బొమ్మలు అందుబాటులో ఉంచాలి.
- ❖ పిల్లలను వారికిష్టమైన ఆటలు (బయటి ఆటలు / లోపలి ఆటలు) స్వేచ్ఛగా ఆడుకునేందుకు టీచరు ప్రోత్సహించాలి.
- ❖ పిల్లలు వారికి కావలసిన బొమ్మలు / ఆట వస్తువులు తీసుకుని, ఆడుకున్న తరువాత తిరిగి వాటి స్థానంలో పెట్టేటట్లు టీచరు ప్రోత్సహించాలి.
- ❖ పిల్లలు ఆడుకునేటప్పుడు టీచరు అందరినీ గమనిస్తూ ఉండాలి.
- ❖ ఎవరైనా సహాయం అడిగితే చేయాలి.
- ❖ పిల్లలు వాళ్లంతట వాళ్ళే ఆడుకుంటున్నప్పుడు టీచరు మధ్యలో వెళ్ళకూడదు.

## 2. పాటలు

- ❖ పిల్లలకు పరిచయం ఉన్న ప్రాంతీయ పాటలను (చిన్నవి) టీచరు పాడాలి.
- ❖ పిల్లలు తిరిగి పాడకపోయినా, విని ఆనందిస్తే చాలు బలవంతం పెట్టరాదు.
- ❖ పాటలు (పిల్లలకు) అర్థవంతంగా ఉండాలి.
- ❖ పాటలు లయబద్ధంగా, సరళంగా ఉండాలి.
- ❖ పాటలు పాడించేటప్పుడు పిల్లలను గుండ్రంగా నిలబెట్టాలి.
- ❖ టీచరు కూడా వారితో పాటు గుండ్రంలో నిలబడాలి.

❖ పాటను టీచరు అభినయం చేస్తూ పాడాలి.

❖ అభినయం చేస్తూ అందరితో కలిసి పాడేందుకు ప్రోత్సహించాలి.

❖ పాటలోని పదాలు పిల్లల వయస్సుకు, అర్థం చేసుకొనే శక్తికి, వారికిష్టమైన విషయాలకు సంబంధించినవై ఉండాలి.

❖ టీచరు, పిల్లలు స్వంతంగా పాటలు పాడడానికి, కలిసి పాడడానికి, అభినయం చేయడానికి, పాత్రలకు తగ్గట్టుగా నటించడానికి తోడ్పడాలి.

❖ వారంలో చివరి రెండు రోజులు పిల్లలందరు కలిసి, మరియు ఒక్కొక్కరు పాడడానికి టీచరు సహాయపడాలి.

## 3. మాట / సంభాషణ

❖ పిల్లలు అర్థం చేసుకునే భాషలోనే (మాతృభాష) మాట్లాడాలి. వారు తిరిగి మాట్లాడడానికి చాలా అవకాశాలు కల్పించాలి.

❖ టీచరు పిల్లలతో వారికి తెలిసిన / ఇష్టమైన విషయాలు మాట్లాడాలి.

❖ పిల్లలను వారి గురించి, వారికి సంబంధించిన వాటి గురించి మాట్లాడించాలి.

❖ అవకాశం ఉన్నప్పుడల్లా, పిల్లలతో స్వేచ్ఛగా మాట్లాడాలి.

❖ పిల్లలు బడికి వస్తున్నప్పుడు టీచరు తరగతి దగ్గర నిలబడి పిల్లల్ని చిరునవ్వుతో పలకరిస్తూ ఆహ్వానించి, చనువుగా మాట్లాడాలి.

❖ పిల్లలు చెప్పే దానిలో తప్పొప్పులు చూసే దాని కంటే వారి ప్రయత్నానికే ప్రాముఖ్యతను ఇవ్వాలి.

❖ స్వేచ్ఛగా పిల్లలతో మాట్లాడేటప్పుడు, పిల్లలందరు వారి గురించి వారి కుటుంబ సభ్యుల గురించి మాట్లాడడానికి అధిక ప్రాముఖ్యతను ఇవ్వాలి.

❖ టీచరు పిల్లలకు తన పేరు ముందుగా చెప్పాలి.

- తరగతిలోని పిల్లల పేర్లను చిన్న కార్డులపై రాసి ఉంచుకోవాలి.
- పిల్లలను వారి గురించి చెప్పమనాలి. (వాళ్ళ ఇష్టాల, రంగులు, అలవాట్ల మొదలగునవి)
- కుటుంబ సభ్యుల పేర్లను చెప్పించాలి.
- పిల్లలందరూ మాట్లాడడానికి ప్రోత్సహించాలి.
- టీచరు పిల్లలతో ప్రేమ పూర్వకంగా, చనువుగా మాట్లాడాలి.
- తెలిసిన విషయాల గురించి వస్తువుల గురించి ప్రారంభించి చెప్పాలనుకున్న విషయాన్ని పరిచయం చేయాలి.
- ఏ విషయం గురించి సంభాషణ జరపాలనుకుంటున్నారో ముందుగా నిర్ణయించుకోవాలి.
- మొదటి రోజు ఆ విషయానికి సంబంధించిన కొత్త పదాలను పరిచయం చేస్తూ సంభాషణ జరపాలి.
- చిత్రపటాలు, ఫ్లాష్ కార్డులు, పరిసరాలలోని వస్తువులు ఉపయోగిస్తూ సంభాషణ ప్రారంభించాలి / నిర్వహించాలి.
- పెద్ద పిల్లలు మాట్లాడేటప్పుడు చిన్న పిల్లలను చూడమనాలి.
- కొత్త పదాలను ఉపయోగిస్తూ మాట్లాడేటట్లు పిల్లలను ప్రోత్సహించాలి.
- ఆలోచనకు సంబంధించిన ప్రశ్నల ద్వారా పిల్లలను ఆలోచింపజేసి సమాధానాలు చెప్పించాలి.
- పిల్లలు ఉదయం నుండి (దిన చర్యలు సంబంధించి) వారు చేసే పనుల గురించి స్వేచ్ఛగా మాట్లాడించాలి.
- టీచరు పిల్లలందరిని వలయాకారంలో కూర్చోపెట్టాలి.
- చిన్న, చిన్న ప్రశ్నల ద్వారా సమాధానాలు చెప్పించాలి.

## 4. కథలు

- ❖ కథలను ఆసక్తిదాయకంగా చెప్పాలి.
- ❖ కథకు సంబంధించిన వివిధ వస్తువుల చూపిస్తూ కథలను చెప్పాలి.
- ❖ పిల్లలు కథను ఆనందించేటట్లు చూడాలి.
- ❖ పిల్లలు కథను ఆసక్తిగా వింటే చాలు - తిరిగి చెప్పాలని ఆశించకూడదు.
- ❖ మొదటగా ప్రాంతీయంగా లేదా పిల్లలకు తెలిసిన కథలనే చెప్పాలి.
- ❖ టీచరు కథను చెప్పేటప్పుడు పిల్లలందరిని తనకు కనపడేటట్లు గుండ్రంగా కూర్చోపెట్టాలి.
- ❖ టీచరు కూడా వారితో కలిసి కూర్చోవాలి.
- ❖ కథలోని విషయాలు, పిల్లల వయస్సు, అనుభవాలకు, పరిసరాలకు సంబంధించినవై ఉండాలి.
- ❖ కథలు హింసాత్మకంగా పిల్లలు భయపడేటట్లు ఉండకూడదు.
- ❖ కథలోని పాత్రానుసారంగా టీచరు స్వరాన్ని మార్చాలి. హావభావాలు ప్రదర్శించాలి. ఉదా|| కథలోని పాత్రల భావాలు మార్చాలి. హావభావాలు ఆవు, సింహం మొదలగునవి శబ్దాలతో మార్పు ఉండాలి.
- ❖ కథలోని పదాలు సరళమైనవిగా ఉండాలి. లేకపోతే పిల్లలలో అసహనం పెరిగి కథ వినటంలో ఆసక్తి పోగొట్టుకొంటారు.
- ❖ అవసరమైన చోట కొత్త పదాలు వాడడం వలన పిల్లలకు పదజాలం పెరిగి కొంత భాషవస్తుంది.
- ❖ ప్రత్యేకించి కథలో వారికి ఇష్టమైన పాత్రల గురించి మాట్లాడించాలి.
- ❖ కథకు సంబంధించిన పాత్రల యొక్క ముఖం తొడుగులు (మాస్కులు0 అభినయం చేయించేటప్పుడు ఉపయోగించాలి.

❖ బొమ్మల పుస్తకాలు ఉపయోగించి కూడా కథలు చెప్పాలి.

❖ అభినయం, నాటకీకరణ, వరుస క్రమంలో కథను చెప్పడం, స్వంత మాటలలో కథను చెప్పేందుకు పిల్లలకు అవకాశాలు కల్పించాలి / ప్రోత్సహించాలి.

❖ ఒకే కథను వారం రోజులు వివిధ పద్ధతులలో చెప్పాలి.

❖ కథ చెప్పేటప్పుడు ఆలోచింపచేసే చిన్న చిన్న ప్రశ్నలు వేయాలి.

❖ రెండవ రోజు కథాంశాన్ని సూచించే చిత్ర పటాలు కాని, కథా పాత్రల యొక్క చిత్రపటాలు కాని, పప్పెట్ల కాని ఉపయోగించి కథ రసవత్తరంగా చెప్పాలి.

❖ మూడవ రోజు కథలోని పాత్రలవలె అభినయం చేయించాలి. పాత్రల గురించి మాట్లాడింపజేయాలి.

❖ నాలుగవ రోజు కథను నాటకీకరణ చేయించాలి.

❖ అయిదవ రోజు టీచరు పిల్లలకు కథకు సంబంధించిన ఫ్లాష్ కార్డులను, చిత్రపటాలను ఇచ్చి కథను చెప్పిస్తూ వాటిని కథ ప్రకారం వరుస క్రమంలో పెట్టించాలి.

❖ ఆరవ రోజు పిల్లలచే కథను చిన్న చిన్న ప్రశ్నలు వేస్తూ చెప్పించాలి. (సొంత పదాల చెప్పడానికి, ప్రోత్సహించాలి.